లోపభూయిష్టంగా పంచాయతీరాజ్ చట్టం



స్టేషన్‌ఘన్‌పూర్: సన్మానం పొందిన ఎంపీపీ, ఎంపీటీసీలతో ఎమ్మెల్యే శ్రీహరి



బచ్చన్నపేట: ఎంపీటీసీలతో జెడ్పీ చైర్ పర్సన్ భాగ్యలక్ష్మి, ఎమ్మెల్యే పల్లా



కొడకండ్ల: ఎంపీపీ జ్యోతిని సన్మానిస్తున్న అధికారులు



లింగాలఘణపురం: మాట్లాడుతున్న జయశ్రీ

- ప్రజాప్రతినిధుల వీడ్కోలు సమావేశంలో ఎమ్మెల్యే కడియం శ్రీహరి

స్టేషన్‌ఘన్‌పూర్: పంచాయతీరాజ్ చట్టం లోపభూయిష్టంగా ఉందని, ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు ఉత్సవ విగ్రహాల్లా మారారని స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. ఘన్‌పూర్ మండల పరిషత్ పాలకవర్గమైన ఎంపీపీ, ఎంపీటీసీల పదవీకాలం ముగియడంతో బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వీడ్కోలు సన్మాన సభ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంపీపీ కందుల రేఖగట్టయ్య అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. గతంలో మూడంచెల వ్యవస్థ బాగుండేదని, ప్రస్తుతం ఐదంచెల వ్యవస్థతో ఎంపీటీసీలకు, జెడ్పీటీసీలకు సరైన ప్రాధాన్యత లేకుండా పోయిందన్నారు. ఇప్పటికైనా పాత మూడంచెల వ్యవస్థనే కేంద్రం తీసుకురావాలని, ఆ దిశగా రాష్ట్ర ప్రభుత్వం తరఫున కృషి చేస్తానన్నారు. అనంతరం ఎంపీపీని, ఎంపీటీసీలను శాలువాలు, మెమెంటోలతో ఘనంగా సన్మానించారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ..

మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 102 మంది లబ్ధిదారులకు స్థానిక రైతువేదికలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే చేతులమీదుగా చెక్కులను పంపిణీ చేశారు. ఎంపీపీ కందుల రేఖగట్టయ్య, తహసీల్దార్ వెంకటేశ్వర్లు, ఎంపీడీఓ ఉమాదేవి, ఎంపీఓ సుధీర్ డీటీ విజయ్‌కుమార్, ఆర్‌ఐలు అర్జున్, రవీందర్, ఎంపీటీసీలు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి కృషి..

జఫర్‌గఢ్: నా చివరి రక్తం బొట్టు వరకు నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ, జెడ్పీటీసీ, ఎంపీటీసీల వీడ్కోలు కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఎంపీపీ రడపాక సుదర్శన్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. రాజకీయాల్లో పదవీ విరమణ ఉండదన్నారు. పదవి ఉన్నా లేకున్న ప్రజల మధ్యే ఉంటూ వారికి సేవ చేయాలన్నారు. అనంతరం ఎంపీపీ, జెడ్పీటీసీ సభ్యులతో పాటు ఎంపీటీసీలను శ్రీహరి ఘనంగా సన్మానించారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 101 మంది లబ్ధిదారులకు ఎమ్మెల్యే కడియం శ్రీహరి చేతుల మీదుగా కల్యాణలక్ష్మి చెక్కులను బుధవారం పంపిణీ చేశారు. వీటితో పాటు 6 గురు లబ్ధిదారులకు సీఎం సహాయనిధి చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రడపాక సుదర్శన్, జెడ్పీటీసీ సభ్యురాలు ఇల్లందుల బేబి శ్రీనివాస్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తీగల కర్ణాకర్‌రావు, వైస్ ఎంపీపీ కొదారి కనకయ్య, ఎంపీడీఓ సుమన్, తహసీల్దార్ ఆంజనేయులు పాల్గొన్నారు.



దేవరుప్పుల: సన్మానం పొందిన ఎంపీపీ, జెడ్పీటీసీలు, ఎంపీపీలు

అందరికి అందుబాటులో ఉంటా: పల్లా

బచ్చన్నపేట: నియోజకవర్గ ప్రజలందరికీ అందుబాటులో ఉండి సమస్యలపై స్పందిస్తానని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీటీసీ, కోఆప్షన్ సభ్యుల ఆత్మీయ సమ్మేళనంలో జెడ్పీ చైర్ పర్సన్ గిరబోయిన భాగ్యలక్ష్మితో కలిసి పాల్గొని మాట్లాడారు. నాయకులు మాజీలు అయినా తమ వద్ద మీ గౌరవం ఏ మాత్రం తగ్గదని, ఏ పని ఉన్నా పార్టీల కతీతంగా రావొచ్చునని తెలిపారు. అనంతరం ఎంపీటీసీలను శాలువాలతో సన్మానించారు. ఎంపీపీ బావండ్ల నాగజ్యోతి, ఎంపీడీఓ రఘురామకృష్ణ, తహసీల్దార్ విశాలాక్షి, వైస్ ఎంపీపీ కల్లూరి అనిల్ రెడ్డి, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షులు దూడల కనుకయ్య, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

ప్రజాప్రతినిధులకు సన్మానం

జనగామ రూరల్: ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం నిత్యం పనిచేస్తే అవకాశాలు తప్పకుండా వస్తాయని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. జనగామ మండల పరిషత్ సభ్యుల ఆత్మీయ వీడ్కోలు సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ఎంపీపీ మేకల కళింగరాజు, ఎంపీటీసీ సభ్యులను శాలువాలతో సత్కరించారు.

ప్రజలు సేవలను గుర్తుంచుకుంటారు

నర్మెట: ప్రజా ప్రతినిధులు ప్రజలకు చేసిన సేవలను గుర్తుంచుకుంటారని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఎంపీటీసీల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఎంపీటీసీలను శాలువాలతో సన్మానించారు. జెడ్పీటీసీ మాలోత్ శ్రీనివాస్, ఎంపీడీఓ అరవింద్‌చౌదరి, ఎంపీపీ తేజావత్ గోవర్ధన్, వైస్ ఎంపీపీ మంకెన ఆగిరెడ్డి, ఉమ్మడి మండలాల కన్వీనర్ రాజిరెడ్డి, ఎంపీటీసీలు నాయకులు పాల్గొన్నారు.

ప్రజా జీవితానికి విరామం ఉండదు

కొడకండ్ల: ప్రజా జీవితంలో ప్రజలకు సేవ చేసే భాగ్యం దక్కడం అదృష్టమని, ప్రజా జీవితంలో సేవ చేయాలనుకునే వారికి విరామం ఉండదని ఎంపీపీ జ్యోతిరవీంద్రగాంధీనాయక్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ప్రాదేశిక సభ్యుల ఆత్మీయ వీడ్కోలు సమావేశాన్ని నిర్వహించి ఎంపీపీ, ఎంపీటీసీలను అధికారులు ఘనంగా సన్మానించారు. డీసీసీబీ వైస్ చైర్మన్ వెంకటేశ్వర్‌రెడ్డి, ఈజీఎస్ డైరెక్టర్ యాకయ్య, తహసీల్దార్ అంజయ్య, నాయబ్ తహసీల్దార్ చంద్రమోహన్, ఎంపీడీఓ నాగేశ్వరశాస్త్రి సూరి, ఎంపీఓ ఇందిర, వైస్ ఎంపీపీ వీరసోములు, ఎంపీటీసీలు విజయలక్ష్మి, నసీరుద్దీన్, మణెమ్మ, యాదమ్మ, రాంకోటి, లక్ష్మీదేవి, పీఆర్ ఏఈ హరికృష్ణ, మండల పరిషత్ సిబ్బంది పాల్గొన్నారు.

మరింత ఉన్నత పదవులకు ఎదగాలి

లింగాలఘణపురం: ఎంపీటీసీలు, ఎంపీపీటీలగా ఐదేళ్ల పదవీ కాలం నిర్వహించిన ప్రజాప్రతినిధులు భవిష్యత్‌లో మరింత ఉన్నత పదవులకు ఎదగాలని మండల స్పెషల్ ఆఫీసర్ కె.ఆర్.లత అన్నారు. ఐదేళ్ల పదవీ కాలం ముగిసిన సందర్భంగా ఎంపీపీ జయశ్రీ ఆధ్వర్యంలో నిర్వహించిన వీడ్కోలు సమావేశంలో లత పాల్గొని మాట్లాడారు. ఎంపీడీఓ జలేందర్‌రెడ్డి, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

ఐదేళ్ల పాలన సంతృప్తిని కలిగించింది

దేవరుప్పుల: బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో కొనసాగిన ఐదేళ్ల పాలనలో మండల సమగ్రాభివృద్ధి కోసం పాటుపడిన తీరు సంతృప్తిని కలిగించిందని ఎంపీపీ బస్వ సావిత్రి మల్లేషం, జెడ్పీటీసీ పల్ల భార్గవి సుందర్‌రామిరెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని అక్షర గార్డెన్‌లో ఎంపీడీఓ కె లక్ష్మీనారాయణ అధ్యక్షతన పదవీ కాలం ముగిసిన ప్రజాప్రతినిధులను సన్మానించి జ్ఞాపికలను అందజేశారు.

క్లుప్తంగా

రైతుల అభిప్రాయాన్ని ప్రభుత్వానికి నివేదిస్తాం



పాలకుర్తి: రైతు భరోసా తీరుతెన్నులపై రైతులు తెలిపిన అభిప్రాయాన్ని ప్రభుత్వానికి నివేదిక రూపంలో అందిస్తామని జిల్లా వ్యవసాయాధికారి వినోద్ కుమార్ తెలిపారు. బుధవారం పాలకుర్తి, ఎల్లరాయని తొర్రూరు గ్రామాల్లో రైతు భరోసాపై అభిప్రాయ సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వినోద్‌కుమార్ మాట్లాడారు. ఎంపీపీ నల్ల నాగిరెడ్డి, సహకార సంఘాల రిజిస్ట్రార్ జి.ప్రియాంక, వ్యవసాయ శాఖ డివిజన్ సహాయ సంచాలకులు పరశురాం నాయక్, రణధీర్, రంగారెడ్డి, సత్యనారాయణపాల్గొన్నారు.

లింగాలఘణపురం: రైతు భరోసాపై అన్నదాతలు తెలిపిన అభిప్రాయాలను ప్రభుత్వానికి నివేదిస్తామని డీసీఓ రాజేందర్‌రెడ్డి అన్నారు. మండలంలోని క్లైం, లింగాలఘణపురం పీఏసీఎస్ పరిధి రైతులతో రైతు భరోసా అర్హతలపై ఏర్పాటు చేసిన సమావేశాల్లో ఆయన మాట్లాడారు. డీసీఏఓ మురళీరమణ, ఏఓ వెంకటేశ్వర్లు, సీఈఓ శ్రీనివాసు పాల్గొన్నారు.

ఇళ్ల ఆక్రమణ సరికాదు

పాలకుర్తి: పంపిణీ చేయకుండానే డబుల్ బెడ్రూం ఇళ్లను ఆక్రమించుకోవడం సరికాదని అధికారులు అన్నారు. మండలంలోని గూడూరు గ్రామంలో నిర్మాణం పూర్తయిన డబుల్ బెడ్రూం ఇళ్లను పంపిణీ చేయకపోవడంతో బుధవారం లబ్ధిదారులు ఇళ్లను ఆక్రమించుకున్నారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ వెంకటేశ్వర్లు సీఐ మహేందర్ రెడ్డి, ఎస్సై ప్రసన్న కుమార్, నాయబ్ తహసిల్దార్ వేణుగోపాల్ రెడ్డి అక్కడికి చేరుకొని లబ్ధిదారులకు నచ్చజెప్పి ఖాళీ చేయించారు. ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి, జిల్లా కలెక్టర్‌తో మాట్లాడి అర్హులకు ఇళ్లు వచ్చేలా చూస్తామన్నారు. త్వరలో పంపిణీ చేస్తామని వారు హామీ ఇచ్చారు.

బోలే బాబాను శిక్షించాలి

జనగామ రూరల్: యూపీలోని హత్రాస్ జిల్లాలోని ఫూల్‌రామ్ గ్రామంలో తొక్కిసలాటలో మృతులకు కారణమైన బోలే బాబాను కఠినంగా శిక్షించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా కేంద్రంలోని సీపీఎం కార్యాలయంలో అహల్య అధ్యక్షతన ముఖ్యకార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కనకారెడ్డి మాట్లాడుతూ యూపీలో జరిగిన సత్సంగ్ కార్యక్రమంలో పెద్దలు, పిల్లలు తొక్కిసలాటలో మృతి చెందారని, ఇలాంటి ఘటన ఎక్కడా జరగలేదని అన్నారు. మృతులకు ఒక్కొక్కరికి రూ. 25 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని, గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని డిమాండ్ చేశారు. నాయకులు పాల్గొన్నారు.

న్యాయం చేయండి

చిల్పూరు: 2011 నుంచి కాస్తులో ఉన్న భూమిని తమ పేర చేయించి న్యాయం చేయాలని మండలంలోని కొండాపూర్ గ్రామానికి చెందిన కుంచ కార్యవర్ధిరాజు, శివరాత్రి చిన రాజయ్య.. అధికారులను కోరారు. బుధవారం గ్రామ సమీపంలోని వ్యవసాయ పొలంలో భూ కాగితాలతో వివరాలను వెల్లడించారు. 2011లో 180 ఏలో గ్రామానికి చెందిన పసునూరి నరేందర్‌రెడ్డి వద్ద ఇద్దరం ఒక్కో ఎకరం కొనుగోలు చేసినట్లు తెలిపారు. అప్పటి నుంచి తామే కాస్తు చేసుకుంటూ జీవిస్తున్నామన్నారు. 20015లో ఇదే గ్రామానికి చెందిన గన్‌డ్రెడ్డి వినోద పేర పట్టా అయినట్లు తెలిస్తే అధికారుల చుట్టూ తిరుగుతున్నామన్నారు. ఇప్పటికీ తామే కాస్తులో ఉన్నామని ఈ విషయంలో అధికారులు పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి న్యాయం చేయాలని కోరారు. కాగా, ఇటీవల ఈ విషయమై పోలీస్‌స్టేషన్‌లో బాధితులు ఫిర్యాదు చేయగా బుధవారం స్థానిక ఎస్సై ముత్తం రాజేందర్ పొలంను పరిశీలించి ఉన్నతాధికారులకు వివరిస్తామని తెలిపారు.

పరామర్శ



జనగామ: తెలంగాణ ఉద్యమ కారుడు, బీఆర్ఎస్ నాయకుడు ఉల్లెంగుల కృష్ణ ఇటీవల మృతి చెందాడు. కాగా, బుధవారం ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి బాధిత కుటుంబాన్ని పరామర్శించి ఓదార్చారు. కృష్ణ చిత్రపటానికి నివాళులర్పించి ఆర్థికసాయం అందించి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఎమ్మెల్యే వెంట మున్సిపల్ చైర్‌పర్సన్ పోకల జమునలింగయ్య, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు తాళ్ల సురేష్‌రెడ్డి, మున్సిపల్ కో ఆప్షన్ సభ్యులు మసిఉర్ రెహమాన్, నాయకులు సందీప్, నర్సింహులు ఉన్నారు.

కాంగ్రెస్ నాయకుడు సుధాకర్‌ను..

జనగామ మున్సిపల్ మాజీ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు ఎర్రమల్ల సుధాకర్ ఇంటి ముందు పార్కు చేసిన కారును గుర్తు తెలియని వ్యక్తులు దహనం చేయగా, బుధవారం ఉమ్మడి వరంగల్ జిల్లా డీసీసీబీ మాజీ చైర్మన్, జంగా రాఘవరెడ్డి ఆయనను పరామర్శించారు. జరిగిన ఘటనపై ఆయనతో మాట్లాడారు. వేమెళ్ల సత్యనారాయణరెడ్డి, సర్వల నర్సింగారావు, ఉమాపతి, ధర్మగోవర్ధన్‌రెడ్డి, చెంచారపు బుచ్చిరెడ్డి, చారబుడ్ల రాందయాకర్‌రెడ్డి, గనిపాక మహేందర్ ఉన్నారు.

సేవలతోనే ఉద్యోగులకు గుర్తింపు



రఘునాథపల్లి: మాట్లాడుతున్న డీఈఓ రాము



తరిగొప్పుల: రాంచందర్-విజయలక్ష్మి దంపతులను సన్మానిస్తున్న డీఈఓ తదితరులు

రఘునాథపల్లి: సేవలతోనే ఉద్యోగులకు ఎల్లప్పుడు గుర్తింపు లభిస్తుందని జిల్లా విద్యాశాఖాధికారి రాము అన్నారు. మండలంలోని మండెలగూడెం జెడ్పీహెచ్‌ఎస్ గెజిటెడ్ హెచ్‌ఎం దండెబోయిన వృకోధర్ పదవీవిరమణ కార్యక్రమం పాఠశాలలో బుధవారం ఘనంగా జరిగింది. డీఈఓతో పాటు ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ, విద్యార్థులు, గ్రామ పెద్దలు పదవీ విరమణ చేయనున్న వృకోధర్-సరిత దంపతులను శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ ఉద్యోగ జీవితంలో పదవీ విరమణ సహజం అన్నారు. వృకోదర్‌కు విద్యకు సంబంధించి ఏ పని అప్పగించిన వంద శాతం పూర్తి చేశారని కొనియాడారు. అదే విధంగా శ్రీ కళావేదిక నుంచి జిల్లా కార్యదర్శి బోనాసి రేణుక, ప్రకాశ్, వెంకటేశ్వర్లు తదితరులు వృకోధర్ దంపతులను సన్మానించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. మండల నోడల్ అధికారి రఘునందన్‌రెడ్డి, డీసీఈబీ కార్యదర్శి చంద్రబాను, ఏసీజీఈ రవికుమార్, గెడిటెడ్ హెచ్‌ఎం భారతరవీందర్, రిటైర్డ్ ఉపాధ్యాయుడు నీలారపు కిష్టయ్య, ఉపాధ్యాయులు రామ్మోహన్, అనిల్, విజయలక్ష్మి, యాదగిరి పాల్గొన్నారు.

ప్రతీ ఉద్యోగికి పదవీ విరమణ తప్పనిసరి

తరిగొప్పుల: విధుల్లో చేరిన నాటి నుంచి అహర్నిశలు కృషి చేసే ప్రతీ ప్రభుత్వ ఉద్యోగికి పదవీ విరమణ తప్పనిసరని డీఈఓ కె.రాము అన్నారు. స్థానిక జెడ్పీహెచ్‌ఎస్ గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుడు వాస్కార్ రామచందర్ పదవీ విమరణ సందర్భంగా బుధవారం స్కూల్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వీడ్కోలు సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. అనంతరం రాంమచందర్-విజయలక్ష్మి దంపతులను శాలువాతో సన్మానించారు. నోడల్ అధికారులు రఘునందన్‌రెడ్డి, నీలం వేణు, రఘు .శ్రీనివాస్, ఏపీఓ శ్రీధర్, రాంప్రసాద్,ఇంచార్జ్ హెచ్‌ఎం రవీందర్ పాల్గొన్నారు.

బాసర ట్రిపుల్ ఐటీకి విద్యార్థుల ఎంపిక



రేణేశ్వరి | వరుణ్ | సోఫియా | వైష్ణవి | నవ్య | రవీందర్ | సాహితి

కొడకండ్ల: మండలకేంద్రంలోని ఉన్నత పాఠశాలలో గతేడాది పదో తరగతి చదివిన సాయిని రేణేశ్వరి బాసర ట్రిపుల్‌ఐటీ కి ఎంపికైంది. మహబూబాద్ జిల్లా పెద్దవంగర మండలం గంట్లకుంట గ్రామానికి చెందిన రేణేశ్వరి కొడకండ్ల ఉన్నత పాఠశాలలో చదివి పదో తరగతిలో 10 జీపీఏ సాధించి బాసర ట్రిపుల్‌ఐటీలో ప్రవేశం కోసం దరఖాస్తు చేసుకొని సీటు సాధించింది. ఈ సందర్భంగా రేణేశ్వరిని పాఠశాల హెచ్‌ఎం గ్రేస్‌కేజీయారాణి, అధ్యాపకులు అభినందించారు.

కొన్నెకు చెందిన మల్లె వరుణ్..

బచ్చన్నపేట: మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో చదువుకున్న కొన్నె గ్రామానికి చెందిన మల్ల వరుణ్ బాసర ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్లు ఆ పాఠశాల ప్రిన్సిపాల్ కర్ల కృష్ణవేణి తెలిపారు. ఈ సందర్భంగా వరుణ్‌ను అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అభినందించారు.

ఓబుల్‌కేశాపూర్ విద్యార్థి..

జనగామ రూరల్: జనగామ మండలంలోని ఓబుల్ కేశావాపూర్ గ్రామానికి చెందిన సోఫియా సుల్తానా బాసర ట్రిపుల్ ఐటీకి ఎంపికైందని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వీరాంజనీ తెలిపారు. గ్రామస్తులు, విద్యార్థులు సోఫియాను అభినందించారు.

చిన్నపెండ్యాల మండలం నుంచి..

చిల్పూరు: మండలంలోని చిన్నపెండ్యాల, చిల్పూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదివిన ముగ్గురు విద్యార్థులు బాసర ట్రిపుల్ ఐటీకి ఎంపికై నట్లు విద్యాశాఖ మండల నోడల్ అధికారి దాసరి గోవర్ధన్, హెచ్‌ఎంలు సంపత్, దాసి శ్రవణ్‌కుమార్ తెలిపారు. చిన్నపెండ్యాల పాఠశాలలో చదివిన గడ్డం నవ్య, బానోత్ రవీందర్, చిల్పూరు పాఠశాలలో చదివిన టి. వైష్ణవి ఎంపికైనట్లు తెలిపారు.

సింగరాపుపల్లి హైస్కూల్ నుంచి..

దేవరుప్పుల: మండలంలోని సింగరాజుపల్లి హైస్కూల్‌లో పదో తరగతిలో ఉత్తీర్ణత పొందిన బెల్డె సాహితి బాసర ట్రిపుల్ ఐటీకి ఎంపికైంది. సాహితి ఎంపికపై పూర్వపు హెచ్‌ఎం కళావతి, ఉపాధ్యాయులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

గ్రామాల సమగ్రాభివృద్ధే లక్ష్యం

పాలకుర్తి టౌన్: నియోజకవర్గంలోని గ్రామాల సమగ్రాభివృద్ధే లక్ష్యంగా పని చేస్తున్నామని ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి అన్నారు. బుధవారం పాలకుర్తిలోని అంగడిలో రూ. 16 లక్షల వ్యయంతో నిర్మించిన షెడ్లను ఆమె ప్రారంభించారు. అనంతరం జెడ్పీటీసీ పుస్కూరి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడారు. ప్రజల అవసరాల కోసం అంగడిలో ఇంకా ఏమైనా పనులుంటే పూర్తి చేస్తామన్నారు. ఎంపీపీ నల్లా నాగిరెడ్డి, ఎంపీటీసీ పుష్పలీల నాగయ్య, పురుషోత్తం, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు ఎండీ మదార్, సత్యనారాయణ, కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.



షెడ్లను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి

బాణాపురంలో చోరీ

- వెండి, బంగారం అపహరణ

జనగామ రూరల్ : తాళం వేసి ఉన్న ఇళ్లే లక్ష్యంగా దొంగలు చోరీలకు పాల్పడుతున్నారు. జనగామలోని బాణాపురం ప్రాంతానికి చెందిన అంగన్‌వాడీ టీచర్ జైన ఉమాగౌరి తన తల్లికి ఆరోగ్యం బాగోలేక పోవడంతో ఈ నెల 1వ తేదీన ఇంటికి తాళం వేసి భర్త అశోక్‌తో కలిసి పట్టణంలోని గిర్నిగడ్డకు వెళ్లింది. బుధవారం సాయంత్రం ఇంటి తాళం తీసి ఉందని పక్కింటి వారు ఫోన్ చేయగా, ఆమె వచ్చి చూసింది. తాళం పగులగొట్టి బీరువాలో ఉన్న నల్లపూసల తాడు, 3 జతల ముత్యాల గొలుసు, మొత్తం 35 గ్రాముల బంగారంతో పాటు 150 గ్రాముల వెండి వస్తువులను దొంగిలించారు. సమాచారం అందుకున్న వెంటనే ఎస్సై భరత్ ఘటన స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

సమస్యల పరిష్కారానికి కృషి

పాలకుర్తి: గ్రామాల్లో నెలకొన్న సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేస్తానని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాపాక సత్యనారాయణ అన్నారు. బుధవారం ఈరవెన్ను గ్రామంలో సమస్యల గుర్తింపుపై నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కుమారస్వామి, సోమేశ్వర్, రాఘవరావు, గణేష్, రఘు, కృష్ణమూర్తి, సోమన్న, మదార్, అశోక్, మహేందర్ రాము, సురేష్ పాల్గొన్నారు.

ప్రజలకు సేవ చేయడం అదృష్టం



మాట్లాడుతున్న ఎంపీపీ కళింగరాజు

జనగామ రూరల్: ప్రజాప్రతినిధులుగా ఎన్నికై ప్రజలకు సేవచేసే అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నామని ఎంపీపీ మేకల కలింగరాజు అన్నారు. బుధవారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ మాట్లాడారు. గ్రామాల్లో ప్రజలకు సంక్షేమ పథకాలు అందించడంలో, గ్రామాల అభివృద్ధికి ప్రజాప్రతినిధులు, అధికారులు ఎంతో కృషి చేశారని అన్నారు. మండలంలో ఉపాధి పనులు, పాఠశాలల్లో చేపడుతున్న కార్యక్రమాలపై చర్చించారు. కాగా, పెంబర్తి గ్రామంలో కంబాల కుంటనుంచి కాలనీకి వెళ్లే చెరువు కట్టపై విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలని, వ్యవసాయ బావుల వద్ద విద్యుత్ వైర్లు కిందికి ఉన్నాయని వాటిని సరి చేయాలని ఎంపీటీసీ మూల రవి కోరారు. అంతకు ముందు ఎల్లంల, సిద్దెంకి ఎంపీటీసీ బండ లక్ష్మి మృతి చెందగా ఆమె చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. జెడ్పీ సీఈఓ అనిల్‌కుమార్, ఎంపీడీఓ సంపత్‌కుమార్, జెడ్పీటీసీ నిమ్మతి దీపిక మహేందర్‌రెడ్డి, ప్రత్యేక అధికారి ఏఈ శ్రీనివాస్, ఈసీ మాధవరెడ్డి, టీఏ అనిల్, ఎంపీటీసీలు, సుజాత, స్వరూప, పద్మ బాలస్వామి, అధికారులు పాల్గొన్నారు.

ఇళ్ల పట్టాలిచ్చే వరకూ పోరాటం

బచ్చన్నపేట: మండలంలోని గోపాల్‌నగర్ గ్రామంలోని 174 సర్వేనంబర్ ప్రభుత్వ భూమిలో గుడిసెలను వేసుకున్న వారికి ఇళ్ల పట్టాలను ఇచ్చే వరకు పోరాటం ఆగదని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు జోగు ప్రకాశ్ అన్నారు. బుధవారం మండలంలోని గోపాల్‌నగర్ గ్రామంలో గుడిసెవాసులతో సమావేశాన్ని పర్వతం నర్సింహులు అధ్యక్షతన నిర్వహించగా ఆయన పాల్గొని మాట్లాడారు. విజేందర్, వెంకటేశ్, అశోక్, బాల్‌నారాయణ, వెంకటవ్వ, బాల్‌రాజు, కర్ణాకర్, యాదగిరి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రకాశ్

సంక్షిప్త సమాచారం

బాల కార్మికులతో పని చేయిస్తే కేసులు

చిల్పూరు: బాల కార్మికులతో పనులు చేయిస్తే యజమానులపై కేసులు తప్పవని ఎస్సై ముత్యం రాజేందర్ హెచ్చరించారు. ఆపరేషన్ ముస్కాన్‌లో భాగంగా బుధవారం హోటళ్లు, రైస్‌మిల్లులు, ఇటుక బట్టీల్లో సిబ్బందితో కలిసి తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా యజమానులకు అవగాహన కల్పించారు.

బాధ్యతల స్వీకరణ

బచ్చన్నపేట: మండల స్పెషలాఫీసర్‌గా జిల్లా వ్యవసాయ అధికారి వినోద్‌కుమార్ బుధవారం బాధ్యతలను చేపట్టారు.

అన్నదానం

జనగామ: భారతీయ క్రైస్తవ దినోత్సవం పురస్కరించుకుని జిల్లా కేంద్రంలోని ఉస్రుపుర సెంటినరీ బాప్టిస్ట్ చర్చి సీనియర్ పాస్టర్ పి.ఫిలిప్, ఎమాలియా ఆధ్వర్యంలో బుధవారం స్థానిక రాజేశ్వరి సేవాసదన్ అనాథ వృద్ధాశ్రమంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రెసిడెంట్ కె.జాన్, వైస్ ప్రెసిడెంట్ నంద కిషోర్, సెక్రటరీ ఎం .సైలాస్, కోశాధికారి విజయ్ పాల్గొన్నారు.


కౌన్సెలింగ్ నిర్ణయాన్ని కేంద్రం వెనక్కి తీసుకోవాలి

కొడకండ్ల: ఈ నెల 6వ తేదీన నీట్ కౌన్సెలింగ్ జరపాలనే కేంద్రం వెంటనే నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని పాలకుర్తి నియోజకవర్గ ఎన్‌ఎస్‌యూఐ అధ్యక్షుడు దేశగాని హరగోపాల్‌గౌడ్ డిమాండ్ చేశారు. బుధవారం ఆయన మాట్లాడుతూ నీట్ పరీక్షను రద్దు చేసి విద్యార్థులకు న్యాయం చేయాలని, కేంద్ర ప్రభుత్వం ఎన్‌టీఏ సంస్థను రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేస్తూ గురువారం విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించే భారత్ బంద్‌ను విజయవంతం చేయాలని ఆయన కోరారు.

దరఖాస్తుల కోసం ఎగబడిన ప్రజలు

బచ్చన్నపేట: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో ఇళ్ల స్థలాల కోసం దరఖాస్తు చేసుకోవడానికి జనాలు ఎగబడ్డారు. బుధవారం గోపాల్‌నగర్‌లో గుడిసెలను వేసుకున్నవారు, పలు గ్రామాల మహిళలు తహసీల్‌లో దరఖాస్తులను అందించి రిటర్న్ కాపీలను తీసుకున్నారు. ఇంటి స్థలాల కోసం దరఖాస్తులు తీసుకోబోమని తహసీల్దార్ విశాలాక్షి మొదట చెప్పి తిరస్కరించినా పై అధికారుల సూచనల మేరకు దరఖాస్తులను తీసుకున్నారు. కాగా మహిళలు దరఖాస్తులు ఇచ్చి స్లిప్పులు తీసుకోవడానికి ఎగబడగా పోలీసులు వారిని క్యూలో వెళ్లేలా చూశారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



నర్మెట: సైబర్ నేరాలపై అందరూ అప్రమత్తంగా ఉండాలని సీఐ సాయి రమణ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కలిగించారు. ఎస్సై శ్రీకాంత్, ప్రిన్సిపాల్ శరత్‌కుమార్, వైస్ ప్రిన్సిపాల్ సదానందం, విద్యార్థులు పాల్గొన్నారు.

ఏబీవీ జూనియర్ కళాశాలలో..

జనగామ రూరల్: యువత సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని ఎస్సై స్వేత అన్నారు. బుధవారం పట్టణంలోని ఏబీవీ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు.

ఇసుక ట్రాక్టర్ బైండోవర్

బచ్చన్నపేట: మండల కేంద్రంలో అక్రమంగా అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను ఎంఆర్‌ఐ శ్రీనివాస్‌చారి పట్టుకున్న సంఘటన బుధవారం జరిగింది. మండలంలోని జలేందర్‌కు చెందిన ట్రాక్టర్‌లో ఇసుకను అక్రమ తరలిస్తుండగా పట్టుకొని తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశారు.

టిప్పర్ల పట్టివేత

మండల కేంద్రంలో అనుమతులు లేని రెండు కంకర టిప్పర్లు, ఒక ఇటుక ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు మైనింగ్ జిల్లా అధికారి విజయ్‌కుమార్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ పరిమితికి మించి లోడ్‌తో వెళ్తున్న వాహనాలను పట్టుకొని స్థానిక పోలీస్ స్టేషన్‌లో అప్పగించినట్లు తెలిపారు.

ఆర్థికసాయం

చిల్పూరు: కొండాపూర్ గ్రామానికి చెందిన జక్కుల వెంకటయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. బుధవారం సీఎస్‌ఐ ఆధ్వర్యంలో బాధిత కుటుంబాన్ని పరామర్శించి ఆర్థికసాయం అందజేశారు. రాజు, అరుణశోభ, కుమారస్వామి ఉన్నారు.

ఆలయ స్లాబ్ మరమ్మతు పనుల పరిశీలన

చిల్పూరు: నష్కల్ గ్రామంలోని సీతారామచంద్ర స్వామి ఆలయంపై స్లాబ్ పనులను బుధవారం ఆలయ చైర్మన్ కోరుకొప్పుల హరికిషన్, ఎంపీటీసీ పాశం శిరీషసురేష్ పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కాకతీయుల కాలంలో నిర్మించిన ఆలయం పైకప్పు వర్షాలకు ఉరుస్తుండడంతో దేవాదాయ, ధర్మాదాయ శాఖ అధికారుల దృషికి తీసుకెళ్లామన్నారు. దీంతో మంజూరైన నిధులతో స్లాబ్ మరమ్మతు పనులు చేపట్టామని తెలిపారు.

విద్యార్థుల సంక్షేమానికి సోలార్‌లైట్లు



సోలార్‌లైట్లను ప్రారంభించిన ఎంపీపీ జ్యోతి

కొడకండ్ల: మండలకేంద్రంలోని బాలికల రెసిడెన్షియల్ పాఠశాలలోని విద్యార్థుల సంక్షేమం కోసం సోలార్‌లైట్లను ఏర్పాటు చేసినట్లు ఎంపీపీ జ్యోతిరవీంద్రగాంధీనాయక్ అన్నారు. 15వ ఫైనాన్స్ పీఎఫ్ఎంఎస్ పథకం ద్వారా రూ.లక్షతో ఏర్పాటు చేసిన మూడు సోలార్‌లైట్లను బుధవారం ఎంపీపీ ప్రారంభించి మాట్లాడారు. రాత్రి వేళలో గురుకుల ఆవరణలో బాలికలకు సౌకర్యదాయకంగా లైట్లు ఏర్పాటు చేయాలనే సంకల్పంతో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు సహకారంతో రూ.లక్ష నిధులు మంజూరు చేయించానని, ఐదేళ్ల కాలంలో గురుకుల అభివృద్ధికి తనవంతుగా చేయూతనిచ్చానని అన్నారు. ఈ సందర్భంగా ఎంపీపీకి ప్రిన్సిపాల్, విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు. ఈజీఎస్ డైరెక్టర్ యాకయ్య, జీసీసీ మాజీ చైర్మన్ అభిమన్‌గాంధీనాయక్, మాజీ సర్పంచ్ మదుసూధన్, ప్రిన్సిపాల్ దిలీప్‌కుమార్ పాల్గొన్నారు.